RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 378 | 17 ఆదివారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## ఇండియాలో ఒలింపిక్స్ నిర్వహించాలి..

# ఇవే భారత్ నాలుగు లక్ష్యాలు..

### – నెదర్లాండ్స్‌లో ప్రధాని మోదీ



భారత్‌కు నాలుగు అతిపెద్ద ఆకాంక్షలున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇండియాలో ఒలింపిక్స్ నిర్వహించడం అందులో ఒకటని మోదీ తెలిపారు. శనివారం నెదర్లాండ్స్‌లోని హాగ్వేలో భారతీయులతో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ ఆకాంక్షలు, లక్ష్యాలు, రాజకీయ పరిస్థితులపై స్పందించారు. ఇండియాకు నాలుగు ఆకాంక్షలున్నాయన్నారు.

ఒలింపిక్స్ నిర్వహించడం, అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మారడం, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎదగడంతోపాటు ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలవడం అనే నాలుగు లక్ష్యాలున్నట్లు వెల్లడించారు. "భారతీయ ఆకాంక్షలు అనంతం. అలాగే, మన ప్రయత్నం కూడా అపరిమితం. కీలక తయారీ కేంద్రంగా ఇండియా ఎదుగుతోంది. దేశాన్ని ఆధునిక టెక్ స్టార్టప్ వ్యవస్థగా మార్చేందుకు దేశ యువత నిరంతరం పని చేస్తోంది. దేశంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్న దేశ యువతకు ధన్యవాదాలు. ప్రపంచంలోనే ఇండియా మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. సెమీకండక్టర్ల తయారీ హబ్‌గా ఇండియా మారనుంది. ఇటీవలే అతిపెద్ద ఏఐ సదస్సును ఇండియాలో నిర్వహించాం.


ఏఐలో అభివృద్ధి దిశగా ఇండియా ముందడుగు వేస్తోంది. దేశంలో 12 సెమీ కండక్టర్ తయారీ యూనిట్లు సిద్ధమవుతున్నాయి. వాటిలో రెండింట్లో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 2014, మే 16న మా రాజకీయ ప్రయాణం మొదలైంది. ఆ రోజు దేశంలో బీజేపీకి మెజారిటీ దక్కింది. బీజేపీకి, దేశ ప్రజలకు మధ్య బంధం మరింత బలోపేతం అవుతోంది. జల్‌మురి ఇక్కడికి కూడా చేరిందా..? ఇటీవలి ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెరిగింది. దాదాపు 8090 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రతి ఏటా ఓటింగ్ శాతం పెరుగుతోంది. ఇది మన దేశంలో పెరుగుతున్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. అందుకే ఇండియాను 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' అంటారు. భారత్ అభివృద్ధి చెందితే అది ప్రపంచానికి మేలు చేస్తుంది" అని మోదీ ప్రసంగించారు.

---

### మళ్లీ యుద్ధానికి సిద్ధమవుతున్న ట్రంప్.. వచ్చే వారంలో ఇరాన్‌పై

# భీకర దాడులు?



చైనా పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నారని సమాచారం. ఆ దేశంతో నెలకొన్న ఉద్రిక్తతలను సైనిక బలంతోనే పరిష్కరించేందుకు వైట్ హౌస్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై తిరిగి వైమానిక దాడులు చేయాలని పెంటగాన్ వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రముఖ పత్రిక 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. బీజింగ్ నుంచి వచ్చే సమయంలోనే ఇరాన్ శాంతి ప్రతిపాదనలను ట్రంప్ పూర్తిగా తిరస్కరించారు. "నేను ఆ ప్రతిపాదనను చూశాను. అందులో మొదటి వాక్యమే నాకు నచ్చలేదు. అందుకే దాన్ని పక్కన పడేశాను" అని ట్రంప్ మీడియాతో అన్నారు. వచ్చే వారంలోనే ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉంది. అందుకోసం అమెరికా, ఇజ్రాయెల్ దళాలు చరిత్రలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమాసియా నిఘా వర్గాలు చెబుతున్నాయి. గత నెలలో కుదిరిన కాల్పుల విరమణ ముగిసిన తర్వాత 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని కొత్త పేరుతో తిరిగి ప్రారంభించేందుకు అమెరికా రక్షణ శాఖ సిద్ధమవుతోంది. హర్మూజ్‌ను మూసివేస్తే ఇరాన్ వ్యాపారాలన్నీ మూతపడతాయని ట్రంప్ పేర్కొన్నారు. గత రెండు వారాలుగా జలసంధి మూతపడడం వల్ల ఇరాన్‌కు రోజుకు 500 మిలియన్ డాలర్ల నష్టం జరుగుతున్నట్లు చెప్పుకొచ్చారు. షీ జిన్‌పింగ్‌తో జరిగిన చర్చల్లో ఇరాన్ దగ్గర అణ్వస్త్రాలు ఉండొద్దనే విషయంలో చైనా తమతో ఏకీభవించిందని ట్రంప్ తెలిపారు. హర్మూజ్‌ను తెరిచి ఉంచాలని ఇరు దేశాలు కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని మాత్రం తాను జిన్‌పింగ్‌ను కోరలేదని వెల్లడించారు.

### మొత్తం మహిళా లోకాన్నే

# అవమానిస్తున్నారు

### : కవిత




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల వేదికగానే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అలాగే అమరవీరుల కుటుంబాలకు సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం వేసిన ప్రత్యేక కమిటీలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఉద్యమంలో క్రియాశీలంగా పోరాడిన సమస్త మహిళా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. కేవలం కమిటీలతో కాలయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనని, ఒకవేళ జూన్ 2 లోపు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టకపోతే ఉద్యమకారుల సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని గౌరవించేందుకు సూచనలు చేసేలా రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే జీఓ నంబర్ – 679 ద్వారా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కె.కేశవరావు ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభన్ రెడ్డి కమిటీ సభ్యులుగా ఉన్నారు.

### హైదరాబాద్ లో భూముల విలువను

# పెంచబోతున్నాం

### : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



తెలంగాణలో భూముల మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ ధరల) పెంపుదలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే శాస్త్రీయ పద్ధతిలో భూముల మార్కెట్ విలువను సవరించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలను ప్రామాణికంగా తీసుకుని ఈ ధరల పెంపు ఉంటుందని వివరించారు. ఈ శాస్త్రీయ సవరణల వల్ల కొన్ని ప్రాంతాలలో మార్కెట్ విలువ కనీసం రూ. 15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గతంలో రెండు సార్లు భూముల విలువను పెంచిందని మంత్రి గుర్తుచేశారు. అయితే, చివరిగా 2022 ఫిబ్రవరిలో భూముల మార్కెట్ విలువను సవరించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



3

# హస్తకళలకు 'అహోర్యాస్' భరోసా..

ఈ కామర్స్ వేదికనుప్రారంభించిన కేటీఆర్

కళాకారులకు గ్లోబల్ మారెట్ అనుసంధానం

# బండి భగీరథ్‌కు షాక్..

### దేశం వీడకుండా లుకౌట్ నోటీసులు



3

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## తమిళనాడు సీఎం వద్ద హోం, యువజన సంక్షేమం.. మంత్రులకు శాఖల కేటాయింపు



తమిళనాడు ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం ప్రకటన విడుదల చేసింది. విజయ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు లోక్ భవన్ శాఖలను కేటాయించింది.
ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను అట్టిపెట్టుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు... పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను ఆదవ్ అర్జునకు... ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు... ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ.సెంగొట్టయ్యన్‌కు అప్పగించారు.
ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కు... స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు... మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు, ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను ఎస్.కీర్తనకు అప్పగించారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

### : జస్టిస్ సూర్యకాంత్



కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా..

## సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది: మోదీ



భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం సాధిస్తున్న డిజిటల్ ప్రగతిని, ప్రవాస భారతీయుల సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. దేశంలో ఇప్పుడు నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల మేర డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతిక రంగంలో మన దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో కేవలం 4 యూనికార్న్ స్టార్టప్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ నేడు వాటి సంఖ్య 100కు చేరిందని గుర్తుచేశారు. భవిష్యత్తు సాంకేతికతకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దానికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లో ఉన్న భారతీయుల ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను విదేశంలో ఉన్నాననే సంగతి మర్చిపోయానని, సొంత దేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపిస్తోందని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. నెదర్లాండ్స్ నాయకత్వం ఎప్పుడు కలిసినా అక్కడి భారతీయ సమాజం చూపిస్తున్న ప్రతిభను, క్రమశిక్షణను ప్రశంసిస్తూనే ఉంటుందని చెప్పారు. తరాలు మారి, దేశాలు మారినా భారతీయులు తమ కుటుంబ విలువలను, సాంప్రదాయాలను ఎప్పటికీ వదులుకోలేదని కొనియాడారు. ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ ప్రవాసుల హృదయాల్లో బలంగా సజీవంగా ఉందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు.
సరిగ్గా 12 ఏళ్ల క్రితం, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో దశాబ్దాల తర్వాత ఒక సంపూర్ణ మెజారిటీ కలిగిన స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే దేశాభివృద్ధి కోసం తనను ఆగనివ్వకుండా, అలసిపోనివ్వకుండా ముందుకు నడిపిస్తోందని మోదీ ఎమోషనల్ అయ్యారు.

# పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు..

## అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు : పవన్ కల్యాణ్

ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు.



ఆరోగ్య సమస్యలపై తొలిసారిగా స్పందన

గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు.

అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

నన్ను ఇతరులతో పోల్చవద్దు

తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "పొరుగు రాష్ట్ర నేతలా మీరు కూడా చేసి ఉండాల్సింది అని చాలామంది సందేశాలు పంపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు వేరు. అదే పని 2019లో చేస్తే రెండుచోట్లా ఓడించారు కదా అండగా ఉంటానన్న నాయకులంతా ఆ రోజు పారిపోయారు. నాకు పదవి ముఖ్యం అనుకుంటే 2008లోనే ఎంపీగా పోటీ చేసేవాడిని, 2014లోనూ అవకాశం వచ్చింది. కానీ నాకు పార్టీని నిర్మించడం ముఖ్యం" అని స్పష్టం చేశారు.

భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత

రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ నాలుగు కీలక అంశాలను ప్రస్తావించారు.
1.పార్టీ నిర్మాణం: "ఒక పుష్కర కాలం (12 సంవత్సరాలు) తర్వాత పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాల్సిన సమయం వచ్చింది. ఇన్నాళ్లూ సిద్ధాంతాన్ని నమ్మి, ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడిన మీరే ఈ పార్టీకి పునాది. మిమ్మల్ని కేంద్రంగా చేసుకునే కొత్త నిర్మాణం ఉంటుంది" అని తెలిపారు.
2.భావజాలం: జనసేన ఏడు సిద్ధాంతాలను కార్యకర్తలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
3.పొత్తు ధర్మం, భవిష్యత్ మార్గం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్ర ఎలా ఉండబోతోందో వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా స్పష్టత ఇచ్చారు.
4.జాతీయ స్థాయిలో పాత్ర: ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా జనసేన ఎలా ముందుకు సాగాలో, ఇతర రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను ఎలా సమన్వయం చేసుకోవాలో వివరిస్తానని చెప్పారు.

క్షేత్రస్థాయి నాయకులే పార్టీ బలం

పార్టీ బలం తాను కాదని, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలేనని పవన్ పునరుద్ఘాటించారు. "ఒకప్పుడు 150 మందితో మొదలైన పార్టీలో ఇప్పుడు 21.5 లక్షల మంది జనసైనికులు, వీరమహిళలు ఉన్నారు. మిమ్మల్ని 'సాధకులు' అని పిలవాలనుకుంటున్నాను. లక్ష్యాన్ని సాధించేవారే సాధకులు. 'మా ఊరికి నేనే పవన్ కల్యాణ్' అని వైజాగ్‌లో ఒక జనసైనికుడు చెప్పినప్పుడు, నేను కోరుకున్న పార్టీ నిర్మాణం ఇదే అనిపించింది," అని అన్నారు. విజయనగరంలో 'మంగళవారం హుసేన్', నక్సలిజం వీడి ఉపసర్పంచ్ అయిన అరకు యువకుడు బాబూరావు వంటి ఎందరో స్ఫూర్తిదాయక కార్యకర్తలే జనసేన నిజమైన బలమని కొనియాడారు.

"ఈ విజయం ఉమ్మడి పోరాటం వల్లే సాధ్యమైంది. ఈ గెలుపులో నాకు ఎంత వాటా ఉందో, మీ అందరికీ అంతే సమానమైన వాటా ఉంది. మీరంతా లేకపోతే నేను ఎవరిని ప్రేమిస్తాను? నన్ను వీడని నా జనసైనికులు, వీరమహిళలే నా బలం" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కూడా జనసేన ప్రతినిధులు హాజరయ్యారు.

## భోజ్‌శాల తీర్పు బాబ్రీ మసీదు తీర్పులాంటిదే: అసదుద్దీన్ ఒవైసీ

మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు సముదాయాన్ని ఆలయంగా ప్రకటిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పోలి ఉందని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ తీర్పు పూర్తిగా తప్పులతో కూడుకున్నదని, అనేక ప్రాథమిక వాస్తవాలను న్యాయస్థానం విస్మరించిందని ఆయన ఆరోపించారు.
శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒవైసీ మాట్లాడారు. బాబ్రీ మసీదు కేసులో మాదిరిగానే 'ఆస్థ' (నమ్మకం) ఆధారంగానే ఈ తీర్పు కూడా వెలువడిందని ఆయన విమర్శించారు. "బాబ్రీ మసీదు కేసులో ముస్లింల ఆధీనంలో స్థలం లేదని కోర్టు చెప్పింది. కానీ భోజ్‌శాల విషయంలో మాత్రం శుక్రవారం వరకు ముస్లింల ఆధీనంలోనే ఉంది. అక్కడ ముస్లింలు 700 ఏళ్లుగా నమాజ్ చేస్తున్నారు" అని ఆయన గుర్తుచేశారు.
బాబ్రీ మసీదు తీర్పు వెలువడినప్పుడే తాను ఒక విషయం చెప్పానని, 'ఆస్థ' ఆధారంగా ఇచ్చే తీర్పులు ఇలాంటి మరిన్ని వివాదాలకు తలుపులు తెరుస్తాయని హెచ్చరించానని ఒవైసీ అన్నారు. రెండు కేసుల్లో ఇచ్చిన ఊరట కూడా ఒకే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్పు రాజ్యాంగ విలువలకు అనుగుణంగా లేదని, ఒక మతం హక్కులను హరిస్తూ మరో మతానికి అనుకూలంగా తీర్పులివ్వడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు.
చారిత్రక ఆధారాలను విస్మరించారని ఆరోపిస్తూ "1935 నాటి ధార్ స్టేట్ గెజిట్, 1985 నాటి వక్ఫ్ రిజిస్ట్రేషన్, ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-1991 వంటి కీలక అంశాలను కోర్టు పట్టించుకోలేదు. ఈ వాస్తవాలన్నింటినీ సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుని న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాను" అని ఒవైసీ తెలిపారు. 1951లోనే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఇది మసీదు అని, ఇక్కడ కేవలం ముస్లింలు మాత్రమే నమాజ్ చేసుకోవాలని, ఇతర మతాల ప్రార్థనలకు అనుమతి లేదని ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన వివరించారు.అసలు అది ఆలయం కాదని, రాజా భోజ్ సంస్కృత విద్యను ప్రోత్సహించిన ఒక 'గురుకులం' అని శాసనాలు చెబుతున్నాయని ఒవైసీ పేర్కొన్నారు. "ప్రజాస్వామ్య దేవాలయం అని మనం



పార్లమెంట్‌ను పిలుస్తాం. అంతమాత్రాన అది పూజలు చేసే స్థలం కాదు. అలాగే అదీ ఒక గురుకులం మాత్రమే" అని ఆయన పోల్చారు.ఈ కేసులో పిటిషనర్లతో నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఏఎస్ఐ కుమ్మక్కయ్యాయని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 12లను ఉల్లంఘించడమేనని ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. 1995లో ధార్‌లోని కొందరు ముస్లిం పెద్దలు మసీదులో మంగళవారం, బసంత్ పంచమి రోజుల్లో పూజలకు అనుమతిస్తూ ఒప్పందం చేసుకోవడం చారిత్రక తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు.

## 'మీరు ఇలాగే చేస్తే భద్రతా సిబ్బంది గన్ తీయాల్సి వస్తుంది'..

## ఢిల్లీలో జర్నలిస్టుకు రష్యా మంత్రి వార్నింగ్

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ భారత పర్యటనలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో పదేపదే అంతరాయం కలిగించిన ఓ జర్నలిస్టుపై ఆయన తీవ్రంగా స్పందించారు. "మీరు ఇలాగే చేస్తే భద్రతా సిబ్బంది గన్ తీయాల్సి వస్తుంది" అని హెచ్చరించడం సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన లావ్‌రోవ్, మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తుండగా ఈ ఘటన జరిగింది. సమావేశం జరుగుతుండగా ఓ జర్నలిస్టు ఫోన్‌లో మాట్లాడుతుండటంతో పలుమార్లు అంతరాయం కలిగింది. దీంతో లావ్‌రోవ్ మొదట మర్యాదపూర్వకంగా, "దయచేసి మమ్మల్ని వదిలేయండి. మీరు గానీ, మీ ఫోన్ గానీ బయటకు వెళ్లాలి" అని సూచించారు. అయినప్పటికీ సదరు జర్నలిస్టు మళ్లీ ఫోన్‌లో మాట్లాడటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను జోక్ చేయడం లేదు. మీరు మీ ఫోన్ కింద పెట్టకపోతే, వాళ్లు గన్ తీస్తారు" అని గట్టిగా హెచ్చరించారు.ఈ ఘటన పక్కన పెడితే, లావ్‌రోవ్ తన పర్యటనలో భాగంగా పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. గురువారం ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలపైనా చర్చించినట్లు తెలుస్తోంది.2025 డిసెంబర్‌లో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన 23వ వార్షిక సదస్సు తర్వాత భారత్-రష్యా సహకారంలో సాధించిన



పురోగతిని లావ్‌రోవ్ ప్రధానికి వివరించినట్లు పీఎంవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. భారత్-రష్యా మధ్య ఉన్న "ప్రత్యేక మరియు విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం"లో పురోగతిపై లావ్‌రోవ్ అందించిన వివరాలను తాను అభినందిస్తున్నట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 ఆదివారం మే 2026

## ఘనంగా నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం



హైదరాబాద్, మే 16: అమావాస్య, శని జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్, కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్క్ సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9:00 గంటలకు శని దేవుని ఆశీస్సులు కోరుతూ పలువురు భక్తులు పాల్గొనడంతో శని హోమం ప్రారంభమైంది. అనంతరం, బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణరావు మధ్యాహ్నం 12:30 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికుల నుండి అద్భుతమైన స్పందన లభించింది.కార్యక్రమాన్ని జయప్రదం చేసిన భక్తులు, వాలంటీర్లు, మద్దతుదారులందరికీ ఎన్.ఆర్. లక్ష్మణరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## బండి భగీరథ్‌కు షాక్.. దేశం వీడకుండా లుకౌట్ నోటీసులు

మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే నిందితుడు దేశం దాటిపోకుండా ఉండేందుకు పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయించారు. భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ప్రస్తుతం పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారుఇందులో భాగంగా బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక పోలీసు బృందం సోదాలు నిర్వహిస్తోంది. భగీరథ్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నవారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అతని స్నేహితులు, బంధువుల ఇళ్లపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. నిందితుడి జాడ కనిపెట్టేందుకు అన్ని కోణాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు.మరోవైపు ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విషయంలో భగీరథ్‌కు హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేసింది.

## హస్తకళలకు 'అహార్యాస్' భరోసా.. ఈ కామర్స్ వేదికనుప్రారంభించిన కేటీఆర్ కళాకారులకు గ్లోబల్ మారెట్ అనుసంధానం

గ్రామీణ కళాకారులు, చేతివృత్తిదారుల నైపుణ్యాన్ని, గ్రామీణ హస్తకళలను అంతర్జాతీయ వినియోగదారులకు చేరువ చేసేందుకు 'అహార్యాస్' ఆన్‌లైన్ వేదిక భరోసా ఇస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే సంప్రదాయ ఉత్పత్తులను గ్లోబల్ మారెట్‌తో అనుసంధానించాలనే లక్ష్యంతో రూపొందించిన 'అహార్యాస్' ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను శుక్రవారం కేటీఆర్ ప్రారంభించారు. యువ పారిశ్రామికవేత్త అవనిరెడ్డి నేతృత్వంలోని యువ బృందం ఈ వినూత్న వేదికకు ప్రాణం పోసిందని చెప్పారు. పల్లెటూరి ప్రతిభకు సాంకేతికతను జోడించి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం గొప్ప పరిణామమని ప్రశంసించారు. 'భారతీయ గ్రామాల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉన్నది. సామాజిక బాధ్యతతో యువత ముందుకొచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఇలాంటి వేదికలను రూపొందించడం అభినందనీయం' అని కొనియాడారు. యువ పారిశ్రామికవేత్త అవనిరెడ్డి బృందాన్ని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ కళాకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో అహార్యాస్ కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## యంజల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 16:-
ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని యంజల్ గ్రామంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యంజల్ మున్సిపాలిటీ పరిధిలో కమాటి పనులు చేస్తున్న రావుల యాదగిరి శనివారం ఉదయం విధుల్లో భాగంగా కట్ట మైసమ్మ ఆలయం సమీపంలోని పార్కు వద్దకు వెళ్లాడు. అక్కడ సుమారు 55 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడు పెయింటర్ తరహా దుస్తులు ధరించి ఉండగా, నిరాశ్రయుడిగా కనిపించినట్లు తెలిపారు. ఈ ఘటనపై రావుల యాదగిరి ఆదిబట్ల పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిబట్ల పోలీసులు వెల్లడించారు.

## 20న మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వండి కేటీఆర్ ను కలిసి విజ్ఞప్తి చేసిన కెమిస్ట్స్



హైదరాబాద్,మే 16: ప్రజల ఆరోగ్యం, ఫార్మసీ వ్యాపార ప్రయోజనాల పరిరక్షణ కోసంఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే.తారకరామారావును శనివారం తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. కెమిస్టుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించే విధంగా చూడాలని వారు కేటీఆర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ గీసూలాల్ జైన్, సంజయ్ కుమార్ మోడీ, ఆనంద్ కుమార్ గౌడ్, మందా సూర్యప్రకాష్, వికాస్ అగర్వాల్, సతీష్ కుమార్, సుధీర్ గుప్తా, ఎం.సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీనివాస్, తొడుపునూరి రాజు, పెండం కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపి నడ్డి విరుస్తున్న కేంద్ర బిజెపి సర్కార్

### సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి మర్రిగూడెం
కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై విపరీతంగా ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ నడ్డి విరుస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అది ఎన్నికల సందర్భంగా మేము పెట్రోల్ డీజిల్ పై ఎటువంటి ధరలు పెంచమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికలు అయిపోయిన వెంటనే రేట్లు పెంచుతూ మోసం చేస్తున్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినాయి కాబట్టి ఇక్కడ కూడా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచుతున్నామని మాట్లాడుతున్న బిజెపి కేంద్ర సర్కార్ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ తగ్గినప్పుడు ఎందుకు ఇక్కడ ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అమెరికా ఇజ్రాయిల్ దుర్మార్గాలను ఖండించాల్సిన భారత ప్రభుత్వం విసిగ్గుగా ఇరాన్ కు వ్యతిరేకంగా ఉండడం మూలంగా ఆ దేశంతో ఉన్నటువంటి సంబంధాలు దెబ్బతిన్నాయి. విదేశాంగ విధాన నిర్ణయాలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. లౌక్యం లేకపోవడం అమరికే పట్ల అత్యంత బానిసత్వంగా ఉండటం వల్ల దేశం నేడు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రపంచంలో ఉన్న అనేక దేశాలు వారి యొక్క విదేశాంగ విధానం ఇతర దేశాలకు స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండటం వల్ల ఆయా దేశాలలో పెట్రోల్ డీజిల్ పురత లేకుండా ఉన్నది. ఇరాన్ పైన అమెరికా ఇజ్రాయిల్ దాడి కొనసాగిస్తున్నప్పుడు యుద్ధం వద్దు అని కమ్యూనిస్టు పార్టీలతో పాటు మిగతా ప్రగతిశీల పార్టీలు రోడ్ల మీదికి వచ్చి యుద్ధాన్ని ఆపాలని కోరినప్పుడు నకిలీ దేశభక్తులు అంద భక్తులు బిజెపి నాయకులు కమ్యూనిస్టు పార్టీల పైన తప్పుడు ప్రచారం చేస్తూ ఇక్కడ ఉండి మీరు ఇరాన్ కు మద్దతు చేయడం ఏందని అత్యంత అవగాహన రాయిత్యంతో మాట్లాడటం జరిగింది. ఎక్కడో యుద్ధం జరిగితే ఈ దేశానికి ఏం సంబంధం అని ప్రగల్బాలు పలికిన బిజెపి నాయకులు ఇప్పుడు ఇరాన్ లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు పశ్చిమాసియా యుద్ధ వాతావరణం కారణంగానే పెట్రోల్ డీజిల్ పెంచుతున్నామని చెప్పటం దివాన్పూర్తనానికి నిదర్శనం. ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా దాని ప్రభావం అన్ని దేశాలపై ఉంటుంది ఈ మాత్రం అవగాహన లేకుండా ప్రజలను అప్పుదోవ పట్టిస్తూ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తూ బిజెపి కార్పొరేట్ దోపిడీ అనుకూల విధానాలను చేస్తున్నది ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం. డీజిల్ పెట్రోల్ గ్యాస్ రేట్లు పెరగడం అంటే దాని యొక్క ప్రభావం వస్తువుల పై పడి మొదలుకొని అన్ని రంగాలపై ఉంటుంది. ఇది ప్రత్యక్షంగా ప్రజలపై భారాన్ని మోపటమేనని అన్నారు. శ్రమను నమ్ముకుని బతుకుతున్న ప్రజల అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది ప్రజలు కనీస వేతనం పొందలేని పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. అన్ని ధరల పెరగటం మూలంగా వారి రోజువారి జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టపడుతుందని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్ మరియు జక్కల అంజయ్య కొట్టాల సర్పంచ్ కలయిక లింగయ్య , అయితే గూనివెంకటయ్య, జిల్లా బాలకృష్ణ వల్లం యాదయ్య ఎండి నజీర్ వేముల సత్తయ్య, గుండెబోయిన శీను రామారావు నాటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు

# మహేశ్వరం పరిధిలో వ్యక్తి అదృశ్యం



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 16:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎప్పలపల్లి రవీందర్ రెడ్డి (53) అనే వ్యక్తి కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, మహేశ్వరం గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి గత కొంతకాలంగా మనస్థాపానికి గురై ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ నెల 10.05.2026 సాయంత్రం సుమారు 5:00 గంటల ప్రాంతంలో రవీందర్ రెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి 10:00 గంటలైనా ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అనంతరం ఆయన మొబైల్ ఫోన్‌కు కాల్ చేయగా, ఫోన్ ఇంట్లోనే మరిచిపోయి వెళ్లినట్లు గుర్తించారు.ఆ రోజంతా బంధువులు, స్నేహితుల ఇళ్లలో మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం (14.05.2026) రవీందర్ రెడ్డి కుమారుడు ఎప్పలపల్లి ఉదయ్ రెడ్డి (26) మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తప్పిపోయిన వ్యక్తి గుర్తులు:
- పేరు: ఎప్పలపల్లి రవీందర్ రెడ్డి
- వయస్సు: 53 సంవత్సరాలు
- వృత్తి: వ్యవసాయం
- ఎత్తు: 5.6 అడుగులు
- రూపురేఖలు: తెల్లని రంగు భాష: తెలుగు మాట్లాడగలరు దుస్తులు: చొక్కా మరియు ప్యాంటు

విజ్ఞప్తి: పై గుర్తులు గల వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే లేదా సమాచారం తెలిసినా వెంటనే కింది నంబర్లకు సమాచారం ఇవ్వాలని మహేశ్వరం పోలీసులు కోరుతున్నారు.

సంప్రదించవలసిన నంబర్లు:
ఫిర్యాదుదారుడు ఉదయ్ రెడ్డి: 9885770881
మహేశ్వరం స్టా: 8712662684 ఇన్‌స్పెక్టర్: 8712662368 ఎస్ఐ: 8712662404

# ఇంధనం కోసం వెళ్లి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 16:-
మన్నెగూడ, మే 16: మన్నెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్, స్కూల్) సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గుర్రం జగదీశ్వర్ రెడ్డి అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటల సమయంలో బొంగుళూరు నుంచి తుర్కయాంజల్ వైపు తన ఎరుపు రంగు స్విఫ్ట్ కారు (టీఎస్ 07 +ఎ 0026)లో ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో కారులో ఇంధనం అయిపోయింది. అదే సమయంలో అక్కడుగా వెళ్తున్న టీఎస్ 07 ఫీ 2979 నంబర్ గల ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పంగా దీక్షిత్ రెడ్డిని జగదీశ్వర్ రెడ్డి లిఫ్ట్ కోరాడు. ఇద్దరూ కలిసి హస్తినాపురంలోని ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లగా, అది మూసివేసి ఉండటంతో తిరిగి ద్విచక్ర వాహనంపై బొంగుళూరు వైపు బయలుదేరారు. ఈ క్రమంలో మన్నెగూడలోనిస్కూల్ పాఠశాల సమీపానికి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న గుర్రం జగదీశ్వర్ రెడ్డికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పరిస్థితి విషమించి అంబులెన్స్‌లోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న పంగా దీక్షిత్ రెడ్డికి స్వల్ప గాయాలు కాగా, అతడిని మెరుగైన చికిత్స కోసం వనస్థలిపురంలోని సాగర్ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న భృంగి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈసారి ముందే రుతుపవనాలు.. కానీ 'ఎల్ నినో' గండం!



ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి మే 26నే తీరాన్ని పలకరించనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. మే 28 నాటికి పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఈ సానుకూల వార్తతో పాటే ఓ ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. ఎల్ నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.వాతావరణ శాఖ తన తొలి దశ అంచనాలో, జూన్-సెప్టెంబర్ మధ్య వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదై, సాధారణం కంటే తక్కువగా ఉంటుందని పేర్కొంది. రుతుపవనాలు ముందుగా రావడం, మొత్తం వర్షపాతానికి ప్రత్యక్ష సంబంధం ఉండదని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల సమయంలో ఏర్పడే అల్పపీడనాలపైనే వర్షపాతం ఆధారపడి ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ 'స్కైమెట్ వెదర్' వైస్ ప్రెసిడెంట్ మహేష్ పాలవత్ వివరించారు.పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్నే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత ఉపఖండం వైపుగా వచ్చే తేమ గాలులు తగ్గిపోయి, వర్షపాతం తగ్గుతుంది. ఈ ఏడాది మే-జూలై మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 82 శాతం అవకాశాలు ఉన్నాయని అంచనా. గతంలో 2015-16లో తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో వర్షపాతం 86 శాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా మహారాష్ట్రలోని మరాఠ్వాడాలో 40 శాతం లోటుతో తీవ్ర నీటి కొరత, పంట నష్టం సంభవించింది.మొత్తం మీద, రుతుపవనాలు ముందుగా రావడం రైతులకు కొంత ఊరటనిచ్చే అంశమే అయినా, ఎల్ నినో ముప్పు నేపథ్యంలో వ్యవసాయం, నీటి నిల్వలు, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక · hyderabadestate.co.in
17 ఆదివారం మే 2026

# ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## : ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 16:-
రంగారెడ్డి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు, దిశ ఛైర్మన్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ సమావేశంలో ఆయన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, తో కలిసి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ "దిశ" అంటే ఒక మార్గం, అభివృద్ధి అని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పథకాల ద్వారా లభించే ప్రయోజనాలు, సబ్సిడీల వివరాలు సంబంధిత శాఖల అధికారులు పూర్తిగా తెలుసుకుని ప్రజలకు చేరవేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, చిన్నారులకు పోషకాహారం, గుడ్లు, పాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను పూర్తిగా నిరోధించాలని గనుల శాఖ అధికారులకు సూచించిన ఎంపీ, మత్స్యకారులకు చేపల వేటపై పూర్తి స్థాయి శిక్షణతో పాటు అవసరమైన వలలను అందించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీని ద్వారా స్థానిక మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించిన ఎంపీ, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వివరాలను అందజేయాలని కోరారు. బ్యాంకు రుణాల మంజూరులో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొంటూ, జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ముద్ర, విశ్వకర్మ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న చిరు వ్యాపారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని సూచించారు.

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన, ఇతర రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని, చిన్నపాటి మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. పాడి ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండడం లేదని దిశ కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, గోపాలమిత్ర పథకం కింద అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి పశువులకు సత్వర వైద్య సేవలు, సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, వీరపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కొమ్మిశెట్టి కిరణ్మయి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, పౌర సరఫరాల శాఖ అధికారులు వనజాత, హరీష్, మున్సిపల్ కమిషనర్లు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శనీశ్వర స్వామి ఆలయంలో సేవా కార్యక్రమం..

## భక్తులకు అందుబాటులో వాటర్ ప్లాంట్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 16:-
రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామంలో ఉన్న శ్రీ శనీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఆదిభట్లకు చెందిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పల్లె గోపాల్ గౌడ్ తన స్వంత నిధులతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. తన తండ్రి కీర్తిశేషులు పల్లె సుదర్శన్ గౌడ్ స్మారకార్థంగా ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం విశేషం. శనీశ్వర స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శంకర్ రాజు చేతుల మీదుగా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ జైలు అధికారి కే.వి. రమేష్ రాజు, సీనియర్ జర్నలిస్టులు టి.ఎం. చండీశ్వర్, (డాక్టర్) సూరమోని సత్యనారాయణతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా భావంతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పల్లె గోపాల్ గౌడ్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని సభలో పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# సెంట్రింగ్ కార్మికుల సమ్మె ప్రారంభం..

## రేట్ల పెంపుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 16:-
ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సెంట్రింగ్ పనులు నిలిపివేయాలని కొన్ని సంఘాలు ఇచ్చిన పిలుపుకు మద్దతుగా స్థానిక బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ సెంట్రింగ్ యూనియన్ సభ్యులు ఈ బంద్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, గ్యాస్, కిరాణా ఖర్చులతో కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. అయితే సెంట్రింగ్ పనులకు మాత్రం సరైన రేట్లు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. జాక్ సెంట్రింగ్ పనులకు తగిన రేట్లు నిర్ణయించాలని, జీరో నుంచి పది అడుగుల ఎత్తు వరకు స్లాబ్ పనులకు రూ.51 చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సెంట్రింగ్ కార్మికులకు నెల రోజులపాటు శిక్షణ ఇచ్చి, మెటీరియల్ కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రూ.5 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.20 లక్షల బీమా సాయం, ఈఎస్ఐ కింద రూ.5 లక్షల ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు యెలమోని స్వప్న, మండల కన్వీనర్ పి జగన్, సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు రామావత్ మహేష్, కార్యదర్శి కొంగర జంగయ్య, కోశాధికారి చిట్టి రాములు, ఉపాధ్యక్షులు చింతపట్ల మహేందర్, ఏ సత్యం, సహాయ కార్యదర్శులు మంత్రి యాదయ్య, చింతపట్ల కుమార్, డి లింగం, యు రాములు, చిట్టి బాల్‌రాజ్, మేడిపల్లి సుధాకర్, జనగే నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డిలో దిశ మీటింగ్ శాఖల పనితీరుపై సమీక్ష

## డబుల్ ఇండ్లు, రుణాలపై ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కీలక ఆదేశాలు



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే16:)
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వివిధ శాఖల పనులపై సమీక్ష నిర్వహించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.విద్య,వైద్యం,గ్రామీణ నీటి సరఫరా,వ్యవసాయం,పంచాయితీ రాజ్,పౌర సరఫరాలు,పరిశ్రమలు,పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ,ఉద్యానవనం,మిషన్ భగీరథ, గృహ నిర్మాణం,రహదారులు తదితర శాఖల పనితీరును జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి సమీక్షించారు.ప్రభుత్వ పథకాలపై గ్రామాలు,మండలాలు,పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ సూచించారు.అంగన్వాడీల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని,పిల్లలకు పోషకాహారం, గుడ్డు,పాలు అందించాలని చెప్పారు.బాల్యవివాహాల నివారణపై దృష్టి పెట్టాలని,పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖకు సూచించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని,మత్స్యకారులకు శిక్షణతో పాటు అవసరమైన వలలు అందించాలని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.బ్యాంకు రుణాలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి,ముద్ర, విశ్వకర్మ వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు త్వరగా రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు.జిల్లాలో అసంపూర్తిగా ఉన్న రహదారులను పూర్తి చేయాలని,పాడి ఉత్పత్తి పెంపుపై చర్యలు తీసుకోవాలని సూచించారు.పశువైద్య సేవలు అందుబాటులో లేకపోవడంపై స్పందించిన కలెక్టర్, గోపాలమిత్ర పథకం ద్వారా సేవలు మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఐపీఎల్ మ్యాచ్ క్రేజ్.. అలా చేస్తే మీ కష్టార్జితం గల్లంతేనన్న సీపీ సజ్జనార్!



నగరంలో ఐపీఎల్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 22న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనున్న మ్యాచ్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొంది. విరాట్ కోహ్లీ, ప్యాట్ కమిన్స్ వంటి స్టార్ ఆటగాళ్ల పోరును ప్రత్యక్షంగా వీక్షించాలన్న అభిమానుల ఆతృతను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ యాప్‌లు, మోసపూరిత వెబ్‌సైట్ల ద్వారా టికెట్ల విక్రయం పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ క్రికెట్ ప్రియులకు కీలక హెచ్చరికలు జారీ చేశారు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, 'ఎక్స్' (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లలో ఐపీఎల్ టికెట్లపై ఆకర్షణీయమైన ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి. ఐపీఎల్ అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన నకిలీ యాప్‌లను, క్లోన్ వెబ్‌సైట్లను సైబర్ నేరగాళ్లు సృష్టించారు. అసలు యాప్‌ను తలపించేలా లోగోలు, డిజైన్లు ఉపయోగించి, తక్కువ ధరలకే ప్రీమియం స్టాండ్ టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఈ నకిలీ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ లేదా ఏపీకే ఫైల్స్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునేలా లింకులను పంపిస్తున్నారు.

ఈ మోసాలపై సీపీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక ఐపీఎల్ టికెట్ ప్రకటనలను నమ్మవద్దు. అధికారిక యాప్‌ను పోలిన నకిలీ లింకులను క్లిక్ చేసి టికెట్లు బుక్ చేస్తే మీ డబ్బు గల్లంతవ్వడం ఖాయం. డబ్బులు కోల్పోవడమే కాకుండా, మీ బ్యాంకు ఖాతా వివరాలు కూడా నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియా లింకులు, బ్లాక్ మార్కెట్ టికెట్ల ప్రకటనలను నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లపై నిఘా ఉంచామని, ఎవరికైనా అనుమానాస్పద సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 1930 లేదా స్థానిక సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. క్రికెట్ అభిమానులు తమ కష్టార్జితాన్ని కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

## : ప్రధాని మోదీకి కవిత లేఖ



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం."కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు."అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు.17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# సీఎం విజయ్‌ని కలిసిన కమల్ హాసన్...

## ఆరు డిమాండ్లతో కూడిన లేఖ అందజేత



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని విలక్షణ నటుడు కమల్ హాసన్ కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందుకు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకాన్ని అందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా కమల్ హాసన్ ఫొటోలను పంచుకున్నారు."ఈరోజు నేను గౌరవనీయ తమిళనాడు ముఖ్యమంత్రి, సోదరుడు విజయ్‌ని కలిశాను. వారిని స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశాను. తమిళనాడు అభివృద్ధి కోసం ఆయన కన్న కలలు, ఆలోచనలను నాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా నా పట్ల ఆయన ప్రదర్శించిన వినయం, ఆప్యాయత నన్ను గర్వపడేలా చేశాయి" అని పేర్కొన్నారు.ప్రస్తుతం తమిళ సినిమా పరిశ్రమ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ఈ క్రమంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సాయం అవసరమని పేర్కొంది. ఇదే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చి, దీనితో పాటు, ఆరు ముఖ్య డిమాండ్లను ముఖ్యమంత్రి విజయ్ ఎదుట ఉంచినట్లు తెలిపారు. అంతా మంచే జరగాలని ముగించారు.

RNI No Tel /2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# జలగల పట్టి... తోడేస్తున్నారా..?

## – ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల షేక్‌హ్యాండ్‌తో అక్రమ తవ్వకాల జోరు..?

## – అర్షణపెల్లి శిఖం భూములపై నల్లమట్టి వ్యాపారుల కన్ను..!




అర్షణపెల్లి ప్రాంతంలో నల్లమట్టి అక్రమ తవ్వకాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ భూములు, శిఖం ప్రాంతాలపై కన్నేసిన మట్టి వ్యాపారులు అధికార పార్టీ అండదండలతో రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో మట్టిని తవ్వి తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు మాత్రం మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది.
ప్రత్యేకంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలలోని కొందరు అధికారుల సహకారం లేకుండా ఈ స్థాయిలో అక్రమ తవ్వకాలు జరగడం సాధ్యం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్లు నిరంతరం తిరుగుతున్నప్పటికీ తనిఖీలు లేకపోవడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
అర్షణపెల్లి శిఖం భూములు ప్రభుత్వ పరిరక్షణలో ఉండాల్సిన ప్రాంతాలు. కానీ ఇప్పుడు అదే భూములు నల్లమట్టి దందాకు కేంద్రంగా మారుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు గ్రామస్తులు డబ్బుల ఆశతో ఈ వ్యవహారానికి సహకరిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. భారీ స్థాయిలో మట్టి తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పర్యావరణ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. వ్యవసాయ భూముల స్వరూపం మారిపోతుందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

# బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సైబరాబాద్ సీపీ

మైనర్ బాలిక కుటుంబం ఫిర్యాదుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈరోజు పోలీసుల ఎదుట బండి భగీరథ్ లొంగిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈ అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందించారు. బండి భగీరథ్‌ను నార్సింగిలోని పోలీస్ అకాడమీ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. అతడిని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామని అన్నారు. ఈ నెల 8వ తేదీన బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. కాసేపట్లో పోలీసులు అతనిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. బండి భగీరథ్ దేశం దాటి వెళ్ళిపోకుండా పోలీసులు ఇటీవల లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఐదు బృందాలతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు.



# బహిరంగ సభకు హనుమకొండ జిల్లా కుమ్మరి సంఘం పిలుపు

హనుమకొండ జిల్లా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆదేశాల మేరకు 17-05-2026 తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశానికి హనుమకొండ జిల్లా పరిధిలోని అన్ని మండలాల కుమ్మరి సంఘం కార్యవర్గ సభ్యులు, కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కుమ్మరి కులస్తుల ప్రస్తుత స్థితిగతులు, వారి జీవనోపాధి అభివృద్ధి, వృత్తి పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దానికి తగిన నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు చైర్మన్, వైస్ చైర్మన్ తదితర నామినేటెడ్ పోస్టులను నియమించి, కుమ్మరి వృత్తి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కుమ్మరి సంఘం అధ్యక్షులు కందికొండ బలరాం, కోశాధికారి పైడిపాల అశోక్, కార్యదర్శి కందుకొండ రమేష్, అసోసియేట్ అధ్యక్షులు పైడిపాల శ్రీనివాస్ తదితరులు



పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..

## – వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రైత్ సింగ్,

పోలీస్ చెక్ పోస్టుల్లో సిబ్బంది తప్పని సరిగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. గోవులతో పాటు మూగ జీవాల అక్రమ రవాణా - నియంత్రణ చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చెక్ పోస్టుల్లో సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కటాక్షపూర్ పోలీస్ చెకోపోస్టు అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ భాగంగా ముందుగా పోలీస్ కమిషనర్ చెక్పోస్ట్ వద్ద ఎర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించడంతో పాటు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి ఈ చెక్పోస్టో రికార్డుల నిర్వహణ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని చెక్పోస్టో సిబ్బంది కోసం ఎయిర్ కూలర్, మంచినీటి ఎర్పాట్లను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చెక్పోస్ట్ సిబ్బంది పలు సూచనలు చేస్తూ పోలీస్ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా ఇక్కడ నియమించబడిన సిబ్బందిలో సగం మంది తనిఖీ



నిర్వహించాలని, మరో సగం మంది విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుందని. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని, కంటైనర్లను సైతం తనిఖీ చేయాల్సి వుంటుందని. విధి నిర్వహణలో చెక్పోస్ట్ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ సి ఐ సంతోష్ తదితరులు వున్నారు.

## బండి సంజయ్ తల్లి శకుంతలకు గుండెపోటు

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెను గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. శకుంతల గుండెకు వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బండి సంజయ్ కూడా మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శకుంతలకు గుండెపోటు రావడంతో బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా బండి భగీరథ్ పోక్సో కేసు మీడియాలో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



## కోటగుళ్ళు గోశాల గోమాతలకు దాన బస్తాల వితరణ




ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోమాతలకు గణపురం మండల కేంద్రానికి చెందిన పెద్దపల్లి రమాదేవి విరాట్ చారి దంపతులు తమ 37వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దాన బస్తాలను అందజేశారు. మొదట ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. కోటగుళ్ళు గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేసిన దంపతులకు కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు యాంసాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు




సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు యాంసాని శ్రీనివాస్ 58వ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ప్రెస్ క్లబ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, సెక్రటరీ బొల్లారపు సదయ్య, ట్రెజరర్ బొల్లం అమర్, ఉపాధ్యక్షులు కొండపల్లి దుర్గాప్రసాద్ రావు సంపేట సుధాకర్, తాళ్లపల్లి వేణు గౌడ్, పల్లె నాగరాజు డి .దంజయ్య హరికృష్ణ, గోకారపు సుధీర్, ఎండి నయీమ్, తోట తిరుమలరావు, సంతోష్, సంపేట వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రమేష్ వర్మ, బుచ్చిరెడ్డి, గజ్జె సురేష్ బాబు, వెంకట్, బిరుదరాజు శ్రీనివాస్ సమ్మలాల్ తదితరులు హాజరై యాంసాని శ్రీనివాస్ కు ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



దామెర మండలం పసరగొండ గ్రామానికి చెందిన దామెర ప్రమీల-కుమారస్వామి కోరేనేలు దంపతుల కుమారుడు కృపాకర్ - స్నేహ వివాహ రిసెప్షన్..
అలాగే దుర్గంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు ముదురుకోల్ రాజశేఖర్ సుదీప్తి దంపతుల రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెంట దామెర మండల బీఆర్ఎస్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువనాయకుడు విష్ణురెడ్డి జన్మదిన వేడుకలు..



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు, యువనాయకుడు విష్ణురెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయ ఆవరణలో అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో విష్ణురెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు విష్ణురెడ్డి ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 ఆదివారం మే 2026

# అది కూడా ఒక జీవితమేనా?: సైఫ్ అలీ ఖాన్

బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ నటించిన తాజా చిత్రం 'కర్తవ్య' ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. షారుఖ్ ఖాన్ నిర్మించిన ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా సైఫ్ తన వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన బాధ్యతల మధ్య సమతుల్యత గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా పిల్లలు పుట్టిన తర్వాత తన ఆలోచనా విధానంలో వచ్చిన మార్పుల గురించి ఆయన మనసు విప్పి మాట్లాడారు. నటుడిగా బిజీ షెడ్యూల్స్ వల్ల కుటుంబానికి కేటాయించాల్సిన ఎన్నో ముఖ్యమైన క్షణాలను కోల్పోయానని సైఫ్ అంగీకరించారు. ఇంటిని ఒక 'బేస్ క్యాంప్'తో పోల్చిన ఆయన, మనం పర్వతాలు అధిరోహించడానికి (వృత్తిలో ఎదగడానికి) వెళ్ళినప్పుడు తిరిగి వచ్చి సేదతీరడానికి బేస్ క్యాంప్ అవసరమని, అయితే పర్వతాల పైనే ఎక్కువ కాలం గడిపితే ఆ బేస్ క్యాంప్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో తాను చేసిన వృత్తిపరమైన త్యాగాల వల్ల వ్యక్తిగతంగా ఎంతో నష్టపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరీనా కపూర్‌తో వివాహం తర్వాత తైమూర్, జహంగీర్ పుట్టిన తర్వాత తనలో బాధ్యత పెరిగిందని సైఫ్ తెలిపారు. "ఈ వయసులో కుటుంబంతో గడపడం ఎంత ముఖ్యమో నాకు అర్థమైంది. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు పనిచేసే షిఫ్టులు నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. రాత్రి 11 గంటలకు ఇంటికి రావడం అనేది అసలు జీవితమే కాదు" అని ఆయన పేర్కొన్నారు. అందుకే 2022 నుంచి ఏడాదికి కేవలం ఒకే ఒక ప్రాజెక్ట్ చేస్తూ, మిగిలిన సమయాన్ని తన పిల్లలతో గడపడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు.



కాగా, 'కర్తవ్య' సినిమాలో సైఫ్ అలీ ఖాన్ ఒక పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ఒక నేరాన్ని ఛేదించే క్రమంలో తన కుటుంబం ప్రమాదంలో పడితే, తన వృత్తి ధర్మానికి కట్టుబడాలా లేక కుటుంబాన్ని కాపాడుకోవాలా అనే సంఘర్షణ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో సంజయ్ మిశ్రా, రసిక దుగ్గల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు.

# దర్శకుడిగా రామ్ పోతినేని.. బర్త్ డే రోజున ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్‌ప్రైజ్!




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఒక ఊహించని కానుక ఇచ్చారు. నటుడిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన, ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన 23వ చిత్రం (RAPO23)తో మెగా ఫోన్ పట్టనున్నట్లు వెల్లడించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రాన్ని ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఇందులోని 'వీర' అనే పవర్ ఫుల్ పాత్రలో రామ్ కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ పోస్టర్‌ను బట్టి రామ్ ఒక ఇంటెన్స్ పాత్రతో రాబోతున్నారని అర్థమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కుటుంబానికి చెందిన 'స్రవంతి మూవీస్' బ్యానర్ ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' (RAPO Cinematics) పేరుతో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. దర్శకుడిగా తన తొలి అడుగుపై రామ్ స్పందిస్తూ.. "ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు" అంటూ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. భారీ అంచనాల మధ్య రూపొందనున్న ఈ చిత్రం 2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# సన్‌సెట్ లైట్‌లో సిమ్రాన్ చౌదరి గ్లామర్ షో వైరల్!

సన్‌సెట్ వెలుగులో మెరిసిపోతున్న అందం, కళ్ళతోనే కట్టిపడేసే అభినయం.. వెరసి సిమ్రాన్ చౌదరి లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. బ్లష్ పింక్ డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న ఈ ముద్దుగుమ్మ, తన గ్లామర్‌తో కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తోంది. అటు సినిమాలతో, ఇటు సోషల్ మీడియా పోస్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఈ 'ఈ నగరానికి ఏమైంది' బ్యూటీ గురించి మరిన్ని ఆసక్తికర విశేషాలు మీకోసం..



### సన్‌సెట్ వెలుగులో సిమ్రాన్ సోయగం:

నటి సిమ్రాన్ చౌదరి సోషల్ మీడియాలో షేర్ చేసిన తాజా ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సూర్యాస్తమయం వేళ బంగారు రంగు వెలుగులో ఆమె మరింత ప్రకాశవంతంగా కనిపిస్తోంది. ఇక బ్లష్ పింక్ మ్యాక్సీ డ్రెస్‌లో చాలా సింపుల్‌గా, అంతే ఎలిగెంట్‌గా కనిపిస్తూ తన సహజ సిద్ధమైన అందాన్ని ప్రదర్శించింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా సరే.. 'షీ ఈజ్ ఇన్ బ్లూమ్' అనాల్సిందే!

### డిజైనర్ దుస్తుల్లో దేవకన్యలా..:

ఈ ప్రత్యేకమైన ఫోటోషూట్ కోసం సిమ్రాన్ ప్రముఖ డిజైనర్ 'నేహా రాజు' రూపొందించిన స్టైలిష్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. మినిమల్ మేకప్, వదిలేసిన జుట్టుతో ఆమె లుక్ చాలా రిఫ్రెషింగ్‌గా ఉంది. ప్రముఖ ఫోటోగ్రాఫర్ సుజన ఈ ఫోటోలను అత్యద్భుతంగా క్లిక్ మనిపించారు. ఆమె ఇచ్చే గ్రేస్‌ఫుల్ ఎక్స్‌ప్రెషన్స్ చూసి అభిమానులు మంత్రముగ్ధులవుతున్నారు.

### తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ క్రేజ్:

సిమ్రాన్ చౌదరి గురించి మనందరికీ తెలిసిందే. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. తన మొదటి సినిమాతోనే యూత్ లో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఆ తర్వాత 'సెహరి' వంటి చిత్రాల్లో నటించి, తన నటనతో మంచి ప్రశంసలు అందుకుంది. అందం, అభినయం రెండు కూడా ఆమెకు ఆఫర్లు క్యూ కట్టటానికి ఓ దరి వేసాయి అంతం లో ఆశ్చర్యం లేదు.

### మిస్ ఇండియా టు మూవీ స్టార్:

సిమ్రాన్ కేవలం నటి మాత్రమే కాదు, ప్రొఫెషనల్ మోడల్ కూడా. ఆమె 'మిస్ ఇండియా తెలంగాణ 2017' రన్నరప్‌గా నిలిచింది. మోడలింగ్ రంగంలో ఉన్న అనుభవంతో కెమెరా ముందు చాలా కాన్ఫిడెంట్‌గా కనిపిస్తుంది. గత ఏడాది క్రితం 'లవ్ మీ' సినిమాతో అలరించిన ఈ భామ, ప్రస్తుతం మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది.

### వనవీర మూవీ కోసం వెయిటింగ్:

ఇటీవల జనవరి లో రిలీజ్ ఐన చిత్రం 'వనవీర' లో సిమ్రాన్ చౌదరి ఇందు అనే పవర్ ఫుల్ పాత్రలోనటించి మెప్పించింది. ఈ సినిమాతో సిమ్రాన్ తన కెరీర్‌లో మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాల రిజల్ట్ ఎలా ఉన్నా, సోషల్ మీడియాలో మాత్రం ఈ బ్యూటీ ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటుంది.
సిమ్రాన్ చౌదరి గ్లామర్‌కే కాకుండా, భిన్నమైన పాత్రల్లోనూ తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. లేటెస్ట్ ఫోటోషూట్‌తో ఫ్యాషన్ ప్రియులకు కొత్త గోల్స్ ఇస్తూనే, సినిమాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# ఆ వివాదం నాలో మార్పు తెచ్చింది... లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా మీనన్



ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండకూడదని నిర్ణయించుకున్నానని వెల్లడి
తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు. ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు. కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫోటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారిపోయానని వెల్లడించారు.

# కేన్స్‌లో అలియా భట్.. దేవ కన్యలా మెరిసిపోయిన బాలీవుడ్ క్వీన్!

కేన్స్ రెడ్ కార్పెట్ అంటేనే ప్రపంచవ్యాప్తంగా ఓ క్రేజ్. అలాంటి వేదికపై మన అలియా భట్ అడుగుపెడితే ఆ కళే వేరు. 2026 కేన్స్ ఫెస్టివల్‌లో అలియా ఎంచుకున్న డ్రెస్ అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. 'ఏ ఉమెన్స్ లైఫ్' ప్రీమియర్ కోసం ఆమె ధరించిన 'ఐస్ బ్లూ' గౌన్ చూస్తుంటే, నిజంగానే ఏదైనా ఫెయిరీ టేల్ కథలో నుంచి ఒక యువరాణి నేరుగా దిగి వచ్చిందా అన్నట్లుగా ఉంది. డానియల్ ఫ్రాంకెల్ డిజైన్ చేసిన ఈ గౌన్‌లో అలియా అందం రెట్టింపైంది. ఆ విశేషాలు చూద్దాం..

### ఆ డ్రెస్సులో అలియా మేజిక్:


అలియా ధరించిన ఈ ఐస్ బ్లూ గౌన్ చాలా ప్రత్యేకంగా ఉంది. దీని బాడీ పార్ట్ చాలా ఫిటెడ్‌గా ఉండి, కింద వైపు లేయర్ల వారీగా ఉన్న టల్లే స్కర్ట్ అలియాకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చింది. ఇక సింపుల్‌గా చెప్పాలంటే, ఆధునిక కాలంలో దేవా లోకం నుండి వచ్చిన యువరాణిలా, ఆమె ఆ రెడ్ కార్పెట్‌పై నడుస్తుంటే కెమెరా కళ్లన్నీ ఆమెవైపే తిరిగాయి.

### సరికొత్త స్టైలింగ్:

కేవలం డ్రెస్ మాత్రమే కాదు, ఆమె వేసుకున్న యాక్సెసరీస్ కూడా హైలెట్‌గా నిలిచాయి. మెడకు ధరించిన లేస్ చోకర్ ఆమె లుక్‌ను మరింత ఎలివేట్ చేసింది. మేకప్ విషయానికి వస్తే.. చాలా సహజంగా, గ్లోయింగ్‌గా ఉండేలా ప్లాన్ చేశారు. ఇక జుట్టును స్టైలిష్‌గా పైకి ముడివేసి, కొన్ని వెంట్రుకలను ముఖం మీదకు వదిలేయడం ఆమెకు ఒక సాఫ్ట్ అండ్ క్లాసీ లుక్‌ను ఇచ్చింది.

### సినిమాల విషయానికి వస్తే:

అలియా కేవలం ఫ్యాషన్‌లోనే కాదు, సినిమాల్లోనూ బిజీగా ఉంది. ప్రస్తుతం ఆమె సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ కూడా నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఇది 2027 జనవరిలో విడుదల కానుంది. దీనితో పాటు 'ఆల్ఫా' అనే స్పై థ్రిల్లర్‌లో కూడా అలియా కనిపించబోతోంది. మొత్తానికి అలియా భట్ తన స్టైల్‌తో మరోసారి ఇండియా గర్వపడేలా చేసింది. ఇక కేన్స్‌లో ఆమె వేసుకున్న ఈ ఐస్ బ్లూ గౌన్ సోషల్ మీడియాలో ఇప్పుడు హాట్ టాపిక్. అందం, అభినయం రెండూ కలిస్తే అలియా అని ఆమె మరోసారి నిరూపించుకుంది.



# ఆ విరాళాలతో మాకు సంబంధం లేదు.. ఎన్టీఆర్ టీమ్ క్లారిటీ




యంగ్ టైగర్ ఎన్టీఆర్ పేరును కొందరు దుర్వినియోగం చేస్తున్న వైనంపై ఆయన కార్యాలయం తీవ్రంగా స్పందించింది. సేవా కార్యక్రమాల పేరుతో కొన్ని అభిమాన సంఘాలు, వ్యక్తులు ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ వ్యవహారంతో నటుడు ఎన్టీఆర్‌కు గానీ, ఆయన అధికారిక కార్యాలయానికి గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఓ కీలక ప్రకటన విడుదల చేసింది. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎన్టీఆర్ పేరును వాడుకుని డబ్బు వసూలు చేస్తున్నారని వస్తున్న సమాచారం నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేశారు. ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానాన్ని, ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఎలాంటి అధికారిక అనుమతి లేకుండా ఎన్టీఆర్ పేరు, ఫోటోలు లేదా ఆయన ఫ్యాన్ బేస్‌ను ఉపయోగించి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఎవరూ విరాళాలు అందించి మోసపోవద్దని ప్రజలకు, ముఖ్యంగా అభిమానులకు విజ్ఞప్తి చేసింది. ఇలాంటి చర్యలు చట్టవిరుద్ధమని, వాటిని ప్రోత్సహించవద్దని కోరింది. భవిష్యత్తులో ఎన్టీఆర్ లేదా ఆయన కార్యాలయం ఆధ్వర్యంలో ఏదైనా సేవా కార్యక్రమం లేదా చారిటీ ఈవెంట్ నిర్వహించదలిస్తే, ఆ సమాచారాన్ని కేవలం ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా ఖాతాలు లేదా ఆయన కార్యాలయం ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టత ఇచ్చారు. అప్పటివరకు ఎవరైనా ఆయన పేరు చెప్పి విరాళాలు అడిగితే నమ్మవద్దని సూచించారు. నకిలీ విరాళాల సేకరణ ద్వారా మోసపోయే అవకాశం ఉన్నందున అభిమానులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ కార్యాలయం కోరింది. ఎక్కడైనా అనుమానాస్పదంగా విరాళాల సేకరణ జరుగుతున్నట్లు గమనిస్తే, వెంటనే స్థానిక అధికారులకు లేదా ఎన్టీఆర్ అధికారిక బృందానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఎన్టీఆర్ వరుసగా భారీ చిత్రాలతో కెరీర్‌లో తీరిక లేకుండా ఉన్న సమయంలో ఆయన పేరును కొందరు స్వార్థానికి వాడుకోవడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మోసాలపై ఒకరికొకరు అవగాహన కల్పించుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.